క్లుప్తంగా

జీవిత బీమాతో కుటుంబానికి ధీమా

ఎల్ఐసీ సంస్థ ప్రతినిధి వెంకటరమణారెడ్డి



పాలసీ చెక్కు అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

కందుకూరు: జీవిత బీమాతో కుటుంబానికి కొంత వరకూ ఆర్థిక ఆసరా కల్పించొచ్చని ఎల్ఐసీ సంస్థ ప్రతినిధి ఎం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన మల్లేపల్లి సదానందం ఇటీవల అకాల మరణం చెందాడు. అతను ఎల్ఐసీ జీవిత బీమా సంస్థ ద్వారా నాలుగు పాలసీలు కలిగి ఉన్నాడు. సోమవారం ఆ పాలసీలకు సంబంధించిన చెక్కులను అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవిత బీమా, ప్రమాద బీమా పాలసీలు తీసుకుంటే కుటుంబ యజమాని అనుకోని ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయినప్పుడు అతని కుటుంబానికి జీవితబీమా కొంత వరకూ ఆర్థికంగా తోడ్పడుతుందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ అవసరమైన పాలసీలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ మనోహర్ పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న బడంగ్‌పేట నాయకులు

బడంగ్‌పేట్: ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి భర్త పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం కౌకుంట్లలో నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్ నాయకులు భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, తదితరులు కౌకుంట్లకు తరలివెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆయన నడిచిన బాటలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి కొనసాగుతూ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడ్గుల: ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఏఓ గౌతమ్, ఏఈఓ రాజేష్, ఏపీఎం నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

మహేందర్‌గౌడ్‌కు ఘన నివాళి

మంచాల: మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో సోమవారం బీజేపీ దివంగత నేత మునికుంట్ల మహేందర్‌గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. గ్రామ చౌరస్తాలో మహేందర్ గౌడ్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన మహేందర్‌గౌడ్ ఈ ప్రాంతంలో బీజేపీ బలోపేతం కోసం ఎంతో కృషిచేశారని తెలిపారు. బీజేపీ కార్యకర్త నుంచి మండల అధ్యక్షుడిగా ఎదిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప్, అశోక్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య, మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, నాయకులు రమణారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాశ్, భిక్షపతి, శేఖర్ రెడ్డి, వెంకటేష్, రాజు, రాజేందర్‌రెడ్డి, మహిళ నాయకురాలు జయశ్రీ,, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో ...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 35. దొండ 28, ఆలు 33, ఉల్లి 19, గోకర 33, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 70, క్యాప్సికమ్ 60. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

ఆగని దందా..!

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

- అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఎక్కువ
- గ్రూపులుగా ఏర్పడి రాత్రి వేళల్లో నిర్వహణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు, పోలీసులు
- గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం: తహసీల్దార్

మహేశ్వరం: మండలంలో అక్రమ మట్టి దందా మూడు పువ్వులు..ఆరు కాయలు అన్న చందంగా సాగుతుంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీ వ్యాపారులు, ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. ఈ తంతు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కావలోని బాయి తండా, నాగిరెడ్డిపల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, ఆకన్‌పల్లి, కొత్త తండా, తుమ్మలూరు, సిరిగిరిపురం, పలు గ్రామాల్లో అసైన్డ్, చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో జేసీబీలు, ఇటాచీలతో తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇది యథేచ్ఛగా సాగుతున్నా ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. టిప్పర్లలో అధిక లోడును నింపి తరలిస్తున్న క్రమంలో గ్రామాలు, తండాల్లో ఇటీవల నిర్మాణం చేసిన బీటీ, సిమెంట్ రోడ్లు పాడవుతున్నాయి. దుమ్ము, దూళీ ఇళ్లపైన పడడంతో రాత్రి వేళల్లో పెద్ద..పెద్ద వాహనాల శబ్దం వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా తరలింపు..

మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కొత్త తండా, కావలోని బాయి తండాల్లోని ప్రభుత్వ భూమి, నాగిరెడ్డిపల్లి గ్రామంలో టీఎస్ఐఐసీ అధికారులు ఐటీ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో మట్టి మాఫియా రాత్రి వేళల్లో చేపట్టి టిప్పర్లలో తరలిస్తున్నారు. కొందరు తమ భూములను టీఎస్ఐఐసీ తీసుకుంటుందని ఎకరానికి నష్టపరిహారం ఇస్తారని దురాశతో మట్టి వ్యాపారులతో పొలాల్లోని మట్టిని జేసీబీలు, టిప్పర్లతో తరలించి విక్రయిస్తున్నారు.

దాడులు చేసినా మారని తీరు

ఇటీవల ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా తవ్వేసిన వారిని ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు జరిమానా విధించినా మరుసటి రోజు నుంచే మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో బీజీగా ఉండడాన్ని అదును చూసుకొని రాత్రి వేళల్లో టిప్పర్లు, జేసీబీల సహాయంతో తవ్వి తరలిస్తున్నారు.

వ్యాపారులుగా పార్టీల నేతలే!

రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నేతలు గ్రూపులుగా జతకట్టి ఒకరికొకరు సహకరించుకుంటూ మట్టి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. రోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకూ మట్టిని జేసీబీ, ఇటాచీలతో తోడేసి టిప్పర్లలో నింపి సొమ్ముచేసుకుంటున్నారు. టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వెంచర్లు, ఇటుక బట్టీలలో అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. కొందరు మండలానికి చెందిన రాజకీయ పార్టీల నాయకులే వెనుకుండి నడిపిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.



ఉప్పుగడ్డ తండా సమీపంలో తవ్విన మట్టి



పోలీసులు సీజ్ చేసిన వాహనాలతో నిందితులు (ఫైల్)

క్రిమినల్ కేసులు నమోదు చేస్తా



ఎవరైనా సరే ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడితే, రైతు భూమిని పీఓటీ కింద తీసుకొని మట్టిని తరలిస్తే జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఎన్నికల సందర్భంగా తాము విధుల్లో ఉండడాన్ని అదునుగా చేసుకొని తవ్వకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. మట్టి తవ్వకాలకు సంబంధించిన అనుమతులు ఎవరికీ ఇవ్వలేదు. గతంలో ఎస్ఓటీ దాడులు నిర్వహించి జేసీబీ, ఇటాచీ, టిప్పర్లను పట్టుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి పెనాల్టీలు వేశాం. పోలీసుల సహకారంతో రాత్రి వేళల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. మట్టి వ్యాపారాన్ని ప్రోత్సహించినా, తవ్వకాలు చేపట్టినా ఎంతటివారినైనా ఉపేక్షించం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, మహేశ్వరం

నేడు మద్యం షాపులు బంద్

ఆమనగల్లు: ఆమగనల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా మద్యం షాపులు మూసి ఉంచాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం 6 గంటల వరకు(మొత్తం 24 గంటలు) అన్ని మద్యం షాపులు, బార్‌లు మూసి ఉంచాలని ఆయన కోరారు. షాపులు తెరిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

బడంగ్‌పేట్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ కార్పొరేషన్ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని మహిళా డ్వాక్రా సాధికారిక భవనం ఆవరణ నుంచి అల్మాస్‌గూడ చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఏపీఓ మెప్మ జ్ఞానేశ్వర్, మేనేజర్ నగేశ్, టీఎంసీ ఆర్ శంకర్, మెప్మ, ఆర్‌పీలు, పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం పునఃప్రారంభం



ఆలయ పునఃప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ పునఃప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 1,500 సంవత్సరాలకు చెందిన ఆలయం చాలా ఏళ్లుగా మూతపడి ఉంది. దీంతో ఇటీవల ఈ ఆలయాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్తులు తీర్మానించి పనులు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం ధ్వజస్తంభం, ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా గుడి వద్దకు తీసుకొచ్చారు. ఉదయం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో విశ్వక్సేన ఆరాధన, పుణ్యావాచనం, రక్షాబంధనం, మృతికాస్నానం, అంకురార్పణ, అరణీమథనం, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, ధ్వజ కుంభారాధన, శాంతిపాఠం, వేద విన్నపాలు, అగ్నిప్రతిష్ఠాపన, మూలమూర్తి మంత్ర హోమాలు నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. బుధవారం ఉదయం హోమం, యంత్ర ప్రతిష్ఠాపన, దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, కుంభోద్వాసన, కుంభ ప్రోక్షణ ప్రథమ దర్శనం, తీర్థప్రసాద వితరణ, అనంతరం శాంతి కల్యాణం మంగళశాసనం నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు కొర్పొలు రాంప్రతాప్‌రెడ్డి, ఎలుక నరేందర్‌రెడ్డి, కేసీడీ భూపాల్‌రెడ్డి, గూడూరు కొండారెడ్డి, కొరుప్రోలు రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలో పాల్గొనాలని కోరారు.

విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్‌కు బీజేపీ శ్రేణులు



బడంగ్‌పేట్ నుంచి నామినేషన్‌కు తరలిన నేతలు

బడంగ్‌పేట్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం చేవేళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని ప్రధాని నరేంద్రమోడీకి కానుకగా ఇద్దామని నినదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, రాష్ట్ర నాయకుడు సామ సంజీవరెడ్డి, కార్పొరేటర్లు బంగారు అనిత ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, చిత్రం శ్రీను, లోకం, మహేందర్, సామ సుధాకర్‌రెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించండి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల నాయకులు శైలజ, సమత, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, ముధుసుధన్‌గుప్తా, టేకుపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. మండలంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు జత కలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. నాయకులు మద్దెల శ్రీను, బి.వెంకట్‌రెడ్డి, దుర్గాప్రసాద్, నర్సింలు, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చాన్‌పాషా తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ భవన స్థలం కబ్జా

కమిషనర్‌కు ఫిర్యాదు

బడంగ్‌పేట్: గ్రామ పంచాయతీ భవన స్థలాన్ని మాజీ సర్పంచ్ తనయుడు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని బడంగ్‌పేట వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కాక ముందు అందులో విలీనమైన గ్రామ పంచాయతీలో నాదర్‌గుల్ అతిపెద్ద గ్రామ పంచాయతీ. దీనికి జిల్లాలోనే అతిపెద్ద రెవెన్యూ వచ్చే పంచాయతీకి గుర్తింపు ఉంది. ఈ పంచాయతీ సొంత భవనాన్ని 50 ఏళ్ల క్రితమే నాటి పాలకులు నిర్మించుకొని గ్రామానికి సేవలు అందించారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ కుమారుడు గ్రామ పంచాయతీ భవనం తమదేనని రికార్డులు చూపిస్తూ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని వారు పేర్కొన్నారు. విషయం తెలిసిన మాజీ ఎంపీటీసీ కందాడి శ్రీరాంరెడ్డి, గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. ఆ స్థలం ప్రస్తుతం కొనసాగుతున్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినదని, అట్టి స్థలాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘుకు వినతిపత్రం అందచేశారు. వినతిప్రతం ఇచ్చిన వారిలో కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్, బంగారు శంకర్, వెంకటేశ్ యాదవ్, మర్రి తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎం వెంకట్‌రెడ్డి, యాతం మహేందర్‌యాదవ్, శివకుమార్, శ్రీధర్, నర్సింగ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాదర్‌గుల్ వాసులు

పర్యావరణాన్ని పరిరక్షించండి

కందుకూరు: ధరిత్రి దినోత్సవంతో పాటు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ(సీజీఆర్) 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బాల చైతన్య కేంద్రాల నిర్వాహకురాలు గద్దగూటి దీపిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీజీఆర్ సంస్థ ప్రతినిధి రజినీకాంత్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు తమ సంస్థ 36 లక్షల మొక్కలు నాటిందని, తెలంగాణ ప్రభుత్వం నుంచి హరిత మిత్ర అవార్డు అందుకుందన్నారు. ప్రస్తుతం ఆరు జిల్లాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖతో అనుబంధంగా ఎంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేలా తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరత్నం, ఉపాధ్యాయుడు పైడి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నిర్వాహకులు

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

చేవెళ్ల: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివేకానంద ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు అన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం దేవునిఎర్రవల్లి సమీపంలో ఉన్న వివేకానంద ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలకు తగిన జాగ్రత్తలు, పలు సూచనలను అందించారు. పెరిగిపోతున్న ఛిపరిజ్ఞానం, రియల్ వ్యాపారాలు, కంపెనీలు, అనేక కష్టాలతో రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారన్నారు. రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రైతు లేకపోతే ఈ సమాజానికి తిండి ఉండదన్నారు. మండే ఎండలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలని చెప్పారు. అవసరమైతే తప్పా ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగొద్దని సూచించారు. వేసవి సెలవులు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల దిశానిర్దేశకుడు హరి, వైస్ ప్రిన్సిపాల్ వేణుకుమార్, మేనేజర్ నరేశ్, అధ్యాపకులు వేణుగోపాల్, వెంకట్, ఋషి, నూర్జాహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన ఎంపీటీసీ గౌతిరెడ్డి సునీత భర్త సుదర్శన్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,కాంగ్రెస్‌కి సాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భగ్‌వాన్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, అంబాజీ, శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ నాయకులు.. వెంకట్రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

58 మందికి కంటి పరీక్షలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 58 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 31 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య, లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ.. విద్యార్థులకు పట్టాలు అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థులు